బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 10 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




## రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

ప్రోటీన్‌పై అధ్యయనం

డేవిడ్ బాకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం. జంపర్‌కు అవార్డు

వివరాలు 3వ పేజీలో

### విద్యారంగంలో

# సమూల మార్పులు తీసుకురానున్నాం



- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నామని తల్లిదండ్రులు గర్వంగా చెప్పుకునే రోజులు రావాలి
- నోటిఫికేషన్ ఇచ్చిన 65 రోజుల్లోగా నియామకాలు పూర్తి చేశాం
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌కు ఈనెల 11న శంకుస్థాపన
- నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే విద్యా కమిషన్‌ను
- కొరివి దెయ్యాన్ని రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసినా నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదు
- సీఎం రేవంత్‌రెడ్డి
- డీఎస్సీ 2024 రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు నియామక పత్రాల అందజేత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురానున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియం వేదికగా డీఎస్సీ 2024 రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారుల సమక్షంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్మల్ని చూస్తోంటే దసరా పండుగ మూడు రోజుల ముందే వచ్చిన ట్లుంది.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు గత పదేళ్ల కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నారు. ఆ కొరివి దెయ్యాన్ని రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని మండిపడ్డారు.అన్ని అవాంతరాలను అధిగమించి కేవలం 65 రోజుల్లోనే డీఎస్సీ-2024 నిర్వహించి 10,006 మందికి నియామక పత్రాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 34వేల మంది టీచర్ల బదిలీలతో పాటు 21వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించిన ఘనత ఇందిరమ్మ రాజ్యానిదేనని చెప్పారు.


భారత దేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ లాంటి ఎందరో మహామహులను తీర్చిదిద్దినవి ప్రభుత్వ పాఠశాలలేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని చెబుతూ, ఈ సందర్భంగా సీఎం ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. "విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో బాధ్యతాయుతమైన భావి పౌరువులుగా తీర్చిదిద్దేందుకు ఎప్పటికప్పుడు అవసరమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ మానవీయ విలువలతో మెలిగే భవ్య సమాజ నిర్మాణంలో నావంతు పాత్ర నిర్వహిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను" అని డీఎస్సీ ఎంపికైన అభ్యర్థులు ప్రతినబూనారు.

నీళ్ల, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని, తెలంగాణ వచ్చిన వెంటనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాల్సి ఉండగా, మూడేళ్ల ఆలస్యంగా 2017లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే ఫలితాలు ప్రకటించకుండా రెండేళ్ల తరువాత 2019 నియామకాలు జరిపారని విమర్శించారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకమన్నారు. తనతో పాటు ఇక్కడున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కేకే తో పాటు చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవాళ్ళమేనని సీఎం గుర్తు చేశారు. ప్రభుత్వ రంగంలోని 30 వేల పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులుంటే, ప్రైవేటు రంగంలో 10 వేల పాఠశాలల్లో ఏకంగా 34 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటేనే నమోషీగా భావిస్తున్న పరిస్థితిపై అందరూ ఆలోచించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివామని గర్వంగా

మిగితా 3వ పేజీలో

# రతన్ టాటా కన్నుమూత



**బలగం టీవి, ముంబై**

ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా(86) కన్నుమూశారు. ముంబైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తీసుకుంటున్న ఆయన బుధవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. ఈ మేరకు రతన్ టాటా చనిపోయారంటూ పారిశ్రామికవేత్త హర్ష గోయెంకా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'గడియారం టిక్ చేయడం ఆగిపోయింది. టైటాన్ చనిపోయిది. రతన్ టాటా సమగ్రత, నైతిక నాయకత్వం, దాతృత్వానికి ఒక వెలుగు వెలిగారు, ఆయన వ్యాపార, వెలుపలి ప్రపంచంలో చెరగని ముద్ర వేశారు. ఆయన మన జ్ఞాపకాలలో ఎప్పటికీ ఎదుగుతాడు. ఆర్.ఐ.పి' అంటూ ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష గోయెంకా ట్విట్టర్ వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. వృద్ధాప్య సమస్యల కారణంగా గత కొంత కాలంగా ఆయన వైద్య చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన మృతి చెందారు.



# నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు

- ట్యాంక్‌బండ్‌పై వేడుకలు
- 10 వేల మందితో సంబురాలు..
- ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలు జరగబోతున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించి.. అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ట్యాంక్ బండ్ వద్ద జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల్లో దాదాపు 10 వేల మంది మహిళలు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు సీఎస్ శాంతికుమారి. సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎస్.. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులతో వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. బతుకమ్మ వేడుకలకు మహిళలు భారీగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ట్యాంక్ బండ్ చిల్డ్రన్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్‌తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను సూచించారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్ ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతీ శాఖ ఒక సీనియర్ అధికారిని ప్రత్యేకంగా నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు సీఎం శాంతికుమారి.

గురువారం సాయంత్రం నాలుగు గంటలకు అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ పైకి చేరుకుంటారని.. వారితోపాటు వందలాది మంది కళాకారులు వివిధ కళారూపాలతో ర్యాలీగా వస్తారని తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై జరిగే బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ నుండి ప్రత్యేకంగా బాణాసంచా కాల్చే కార్యక్రమం, లేజర్ షో ఉంటుందని వెల్లడించారు. ఇక.. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా.. పండుగ శోభ సంతరించుకునేలా ఇప్పటికే హైదరాబాద్‌లోని 150 ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడంతోపాటు.. జంక్షన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే.. ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

# 24 గంటల్లో ఏక సభ్య కమిషన్

## ఎస్సీ వర్గీకరణపై 60 రోజుల్లో నివేదిక సమర్పించాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాతే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య న్యాయ కమిషన్ ఏర్పాటు ప్రక్రియ 24 గంటల్లో పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏక సభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం సూచనల మేరకు ముందుకెళ్లాలని ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. ఉపకులాల వారీగా ఎస్సీల వెనకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేసి సిఫార్సులు చేయనుంది. ఈ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విద్వేషాలు రెచ్చగొట్టే ఫ్యాక్టరీ

- ప్రధాని మోడీ



**బలగం టీవి,న్యూఢిల్లీ బ్యూరో**

కాంగ్రెస్ ఒక విద్వేషాలను రెచ్చగొట్టే ఫ్యాక్టరీ అని, హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. హిందువుల్లో చీలికను తెచ్చి మరో వర్గానికి వ్యతిరేకం చేయాలను కుంటుందని విమర్శించారు. అలాగే హస్తం పార్టీని విద్వేషాలను వ్యాప్తి చేసే ఫ్యాక్టరీగా అభివర్ణించారు. మహారాష్ట్రలో రూ.7,600కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రధాని మోడీ బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ "హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ఈ గెలుపు దేశం మూడ్‌ను సూచిస్తోంది. మహారాష్ట్రలో కూడా భారీ విజయం సాధించాలి. ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ', అధికారం కోసం మహారాష్ట్రను బలహీనపరచాలని కోరుకుంటోంది. అయితే పాలకపక్షం 'మహాయుతి' సర్కార్ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోంది. మహారాష్ట్రలో ఇంతవేగంగా ప్రాజెక్టులు పూర్తవ్వడం నేనెప్పుడూ చూడలేదు. కాంగ్రెస్ హయాంలో అవినీతి విషయంలో అదే వేగం, స్థాయి కనిపించింది. కాంగ్రెస్ బాధ్యతారహిత పార్టీ. విద్వేషాలను రెచ్చగొట్టే ఫ్యాక్టరీ." అని అన్నారు నరేంద్ర మోదీ.

కాంగ్రెస్ అభివృద్ధి గురించి ఆలోచించదని అన్నారు. పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధితో కూడిన వికసిత్ భారతే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ముస్లింలలో భయాందోళనలు సృష్టిస్తోందని, వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని ఆరోపించారు.

# రాష్ట్రంలో భయానక వాతావారణం సృష్టించారు



- తెలంగాణలోనూ బుల్డోజర్ సంస్కృతి
- ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని అడిగితే పైసలు లేవంట.
- కానీ మూసీ కోసం మాత్రం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావు ద్దీన్ పటేల్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బతుకమ్మ బతుకమ్మ లాగా లేదు.. దసరా దసరా లాగా లేదు.. ఈ పండుగల వేళ బుల్డోజర్లతో భయానక వాతావరణం సృష్టించారని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావు ద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు. ఇప్పుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇప్పటికే రైతుల ఖాతాల్లోకి పైసలు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవి. ఈ సారి పండుగ పండుగ మాదిరిగా లేకుండా పోయింది. రాష్ట్రంలో పండుగ జరుపుకునే పరిస్థితి లేకుండా భయానక వాతావారణం సృష్టించారు. వరంగల్‌లో ఓ ఎమ్మార్వో బతుకమ్మ ఘాట్ చూసేందుకు వెళితే ఇళ్లు కూలగొట్టేందుకు వచ్చారనుకొని వాళ్లను స్థానికులు తరమికొట్టారట. అలా ఉంది రాష్ట్రంలో పరిస్థితి అని కేటీఆర్ తెలిపారు.


యూపీలోనే బుల్డోజర్ సీఎం ఉన్నాడుకున్నాం. కానీ మన తెలంగాణలో కూడా ఇప్పుడు అలాంటి బుల్డోజర్ సంస్కృతిని తీసుకొచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆఘాయిత్యాలను చూసి ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ పది నెలల వాళ్ల పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. డిసెంబర్ 9 సోనియా గాంధీ బర్త్ డే రోజునే 2 లక్షలు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ స్వయంగా హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ అమలు కాలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

వివరాలు 3వ పేజీలో

# రేషన్ షాపుల్లో ఉచిత బియ్యం పొడిగింపు

- 2028 డిసెంబర్ వరకు పంపిణీ
- ఇతర సంక్షేమ పథకాలూ కొనసాగింపు

**బలగం టీవి,న్యూఢిల్లీ బ్యూరో**



ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఎవై) సహా అన్ని ప్రభుత్వ పథకాల్లో భాగంగా ఫోర్టిఫైడ్ రైస్ ఉచిత పంపిణీ, ఇతర సంక్షేమ పథకాల కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ 2028 డిసెంబర్ వరకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్టు చెప్పారు. ఈ పథకాన్ని మరో నాలుగేండ్లు పొడిగిస్తున్నట్టు తెలిపారు. ఆహార సబ్సిడీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులు సమకూర్చుతుండడంతో 'పీఎంజీకేఎవై' ద్వారా బియ్యంలో పోషకాల చేరిక కేంద్రీయ పథకంగా కొనసాగుతుందని, తద్వారా ఏకీకృత వ్యవస్థలతో పథకం అమలు సాధ్యమవుతుం దని అన్నారు. ఏప్రిల్ 2022లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ పథకాన్ని ఆమోదించిందని, మార్చి 2024 నాటికి ఇప్పటికే మూడు విడుతలుగా పూర్తయ్యాయని తెలిపారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.17,082 కోట్లు ఖర్చు చేస్తుందని, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ప్రకారం.. సాధారణ బియ్యంలో పోషకాలను జోడించి ఫోర్టిఫైడ్ రైస్ తయారు చేస్తారని తెలిపారు. ప్రజల ఆహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సూక్ష్మపోషకాలు జోడిస్తారని అన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ నాణ్యతను పరీక్షించేందుకు 27 ఎన్ఎబిఎల్ ల్యాబ్స్‌ను వినియోగిస్తామని, విటమిన్ మినరల్ ప్రీమిక్స్ టెస్టింగ్ కోసం 11 ఎన్ఎబిఎల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన సప్లై చైన్ డెవలప్‌మెంట్ కోసం రూ.11,000 కోట్లు పెట్టుబడి పెడతామని మంత్రి తెలిపారు.లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ అభివృద్ధికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, దీనివల్ల 22,000 ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. వివిధ దశల్లో ఈ ఎన్ఎంహెచ్‌సీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాజస్థాన్, పంజాబ్ దేశ సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోద ముద్రవేసిందని అన్నారు. రూ.4,406 కోట్లతో 2,208 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లపై మంత్రివర్గ సబ్‌కమిటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ధాన్యం కొనుగోళ్లుగా సజావుగా సాగేందుకు, కొనుగోళ్లలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మంత్రివర్గ ఉపంఘాన్ని నియమించింది.ఈ మంత్రివర్గ ఉప సంఘానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ , ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్. చౌహాన్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.మరో వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేయడమే లక్ష్యం



- భద్రతతో కూడిన రాష్ట్రాన్ని తీర్చిదిద్దడంలో పోలీసు శాఖ పాత్ర ఎనలేనిది
- నిత్యం బిజీగా ఉండే పోలీస్ అధికారులకు క్రీడలతో ఒత్తిడి దూరం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్ల లోని అంబేడ్కర్ స్టేడియంలో రెండో పోలీస్ వార్షిక క్రీడా సంబరాలు ముగింపు కార్యక్రమం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రశాంతమైన మంచి భద్రతతో కూడిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో పోలీసు శాఖ పాత్ర ఎనలేనిదని , ఇటువంటి పోలీసు శాఖకు క్రీడా పోటీల నిర్వహణ ద్వారా వారి ఒత్తిడి కొంత తగ్గుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల లోని అంబేడ్కర్ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రెండవ పోలీస్ వార్షిక క్రీడా సంబరాలు ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలతో స్నేహభావం పెరగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడలు అంటే ప్రత్యేక ఆసక్తితో వాలీబాల్ పోటీలలో పాల్గొని మంచి బహుమతుల సైతం తాను సాధించానని, యువత కబడ్డీ కోకో వాలీబాల్ మొదలగు అన్ని రకాల క్రీడల వైపు ఆసక్తి చూపించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని,ప్రతినిత్యం శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేసే పోలీసు అధికారులకు సిబ్బందికి ఇటువంటి క్రీడా పోటీలు ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. క్రీడా పోటీల నిర్వహణ వల్ల పోలీసు అధికారులు రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని అన్నారు. గ్రామీణ ప్రజలకు సైతం ఏదైనా ఇబ్బందులు ఎదురైతే డయల్ 100 కు ఫోన్ చేస్తే సహాయం అందుతుందనే విశ్వాసం కలిగిందని అన్నారు. పోలీసు శాఖలో సాంకేతికత వినియోగం పెంచేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం మరింత మెరుగ్గా అమలు చేయాలని అన్నారు.

యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వ్యక్తులను కౌన్సెలింగ్ ద్వారా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2036 ఒలంపిక్స్ నాటికి తెలంగాణ నుంచి పతకాలు సాధించాలని ప్రభుత్వం క్రీడా జ్యోతి పాలసీ తయారు చేస్తుందని,గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

నిఘా నేత్రాల ద్వారా శాంతి భద్రతలను మరింత పటిష్టం చేస్తున్నామని, వేములవాడ పట్టణంలో కూడా నిఘా నేత్రాలను అవసరమైన మేర ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ఎస్పీ మంచి కార్యక్రమం తీసుకున్నారని, కుటుం బాలకు దూరంగా ఒత్తిడితో పని చేసే పోలీసు శాఖ అధికారులకు సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారని అన్నారు. మనమంతా ప్రశాంతంగా జీవించాలంటే పోలీసు శాఖ పనితీరు చాలా ముఖ్యమని, ప్రజా ప్రభుత్వంలో పోలీసు శాఖ పనితీరుపై ఎటువంటి ఉత్తర లేకుండా పూర్తి స్వేచ్ఛ కల్పించామని అన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజాన్ మాట్లాడుతూ పోలీస్ శాఖ క్రీడా పోటీలు నిర్వహించడం చాలా మంచి కార్యక్రమం అని, 24 గంటలపాటు అలర్ట్ గా ఉంటూ విధులు నిర్వహించే పోలీస్ శాఖకు ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న సిబ్బంది అందరికీ ప్రత్యేక అభినందనలు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఇటీవలే మానేరు వాగులో ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలని కాపాడిన కానిస్టేబుల్ ను అభినందిస్తూ సర్టిఫికెట్, క్యాష్ ప్రైజ్ అందజేసి సత్కరించారు.అనంతరం క్రీడా పోటీలలో విజేతలకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలసి ట్రోఫీ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు,ఆర్ఐ లు,ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు,పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## గురుకుల పాఠశాలలపై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

- మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రభుత్వం గురుకుల పాఠశాలపై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలోని అభినందన్ హోటల్లో బీసీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు రూ.1525 కోట్లు విడుదల చేయడం శుభచూచికమని, మిగతా 3 వేల కోట్ల రూపాయాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విద్యపై పెట్టే ఖర్చు పెట్టుబడిగా చూడాలని, ఖర్చుగా భావించరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభు త్వం ప్రకటించడంపై స్పష్టమైన విధి విధానాలను ప్రకటించాలని పేర్కొన్నారు. బీసీలకు 330, ఎస్సీలకు 246, ఎస్టీలకు 140, మైనార్టీలకు 206 గురుకులలు ఉన్నట్లు..ఇందులో బీసీ విద్యార్థులకు ఎన్ని ఇస్తారో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోలా జనర్ధాన్, మల్లేశ్‌యాదవ్, నీల వెంకటేశ్, అంజి, నందగోపాల్, కీర్తిలతగౌడ్, హరితిలక్‌సింగ్, నిషి ముదిరాజ్, ప్రణీత, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 14కు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సాధారణ బెయిల్ పిటిషన్‌పై తీర్పును రంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు ఈ నెల 14కు వాయిదా వేసింది. అయితే ఇటీవల తనకు ఉత్తమ నృత్య దర్శకుడిగా అవార్డు వచ్చిందని, అవార్డు అందుకునేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉన్నందున ఈ నెల 6 నుంచి 10 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గత సోమవారం రంగారెడ్డి జిల్లా పోక్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. వాదనలు విన్న కోర్టు ఈ నెల 6 నుంచి 9 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. కానీ జానీ మాస్టర్ అందుకోబోయే పురస్కారాన్ని రద్దు చేసినట్లు ఆయనకు తెలియడంతో తనకు మంజూరైన మధ్యంతర బెయిల్‌ను వినియోగించుకోబోనని కోర్టులో మెమో దాఖలు చేశారు. వచ్చిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్న జానీమాస్టర్ తనకు రెగ్యులర్ బెయిల్ కావాల్సిందిగా కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఈ క్రమంలోనే బెయిల్ పిటిషన్ తీర్పు ఈ నెల 14 కి వాయిదా పడింది.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు..



సద్దుల బతుకమ్మ సందర్భంగా వేములవాడ పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో మహిళలు సంబురంగా బతుకమ్మలు ఆడారు. ఆడ బిడ్డలు, మహిళలు, చిన్నారుల ఆట పాటల తో వేములవాడ పట్టణమంతా మారు మ్రోగింది. అనంతరం మూల వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ అఖిల్ మహాజాన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మహేష్ మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళలు, ప్రజలు, యువతీ యువకులు,తదితరులు పాల్గొన్నారు.

- వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ పట్టణంలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. మన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వేములవాడ పట్టణంలో 7వ రోజు సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీ, ఈ వేడుకలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## 14 నుంచి గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు





**బలగం టీవీ, హైదరాబాద్**

: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ త్వరలోనే హాల్ టికెట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 14న టీజీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. అభ్యర్థులంతా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఓ ప్రకటనలో సూచించింది. ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరుగనున్న విషయం తెలిసిందే. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు పరీక్ష జరుగనున్నది. పరీక్ష హాల్‌లోకి మధ్యాహ్నం 12.30 గంటల నుంచే అభ్యర్థులను అనుమతించనున్నట్లు పేర్కొంది. ఇక గ్రూప్–1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. 3.02లక్షల మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. మెయిన్స్ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. మెయిన్స్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లన్నీ అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాల్సి ఉంటుంది. గ్రూప్–1 మెయిన్స్‌లో మొత్తం ఆరు పేపర్లు ఉండనున్నాయి.

**పరీక్షలు ఇలా..**

**21న** జనరల్ ఇంగ్లీష్ (క్వాలిఫైయింగ్ )
**22న** పేపర్–1 (జనరల్ ఎస్సే)
**23న** పేపర్–2 (చరిత్ర, సంస్కృతి, భూగోళశాస్త్రం)
**24న** పేపర్ –3 (ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, అడ్మినిస్ట్రేషన్)
**25న** పేపర్ –4 (ఎకానమీ, డెవలప్మెంట్)
**26న** పేపర్– 5 (సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇన్టర్ప్రెటేషన్
**27న** పేపర్–6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర నిర్మాణం)



వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి లార్సెన్ అండ్ టూబ్రో సంస్థ 5.50 కోట్ల రూపాయల విరాళం అందించింది. చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్.సుబ్రమణ్యన్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి ఆ మేరకు చెక్కును అందించారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అండగా నిలిచినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు.
బలగం టీవీ, హైదరాబాద్

# మైనర్లకు పొగాకు అమ్మకుండా పటిష్ట చర్యలు..



- పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని పొగాకు వాడకం నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పొగాకు నియంత్రణ కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ యువకులలో పొగాకు వాడకం నివారించేందుకు జాతీయ పొగాకు ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, సే నో టు తుబాకో, ఎస్ టు లైఫ్ నినాదాన్ని బలంగా యువత లోకి తీసుకొని వెళ్ళాలని, సామాజిక మాధ్యమాలలో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఫోటోలు, వీడియోలు అప్ లోడ్ చేయాలని,టి.ఎస్.ఎస్ కళాకారుల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పొగాకు ఉత్పత్తుల చట్టం ప్రకారం స్కూలు ,కాలేజీల ఆవరణ నుంచి 100 మీటర్ల వరకు ఉత్పత్తులను అమ్మ రాదని, 15 రోజుల వ్యవధిలో విద్యాసంస్థల 100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్ డబ్బాలను మూసివేయాలని అధికారులను ఆదేశించారు.

దసరా సెలవుల తర్వాత 15 రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, పొగాకు వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మార్కెట్, సినిమా థియేటర్, పార్కు మొదలగు ప్రజా సంచారం అధికంగా ఉండే ప్రదేశాలలో పొగ త్రాగ రాదు అనే బోర్డులు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అన్నారు .

పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించేందుకు అవసరమైన ఐఈసీ మెటీరియల్ సిద్ధం చేయాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు మహిళలు యువతను రైతులను భాగస్వామ్యం చేస్తూ గ్రామాలలో గ్రామ సభ నిర్వహించి పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని, పొగాకు ఫ్రీ గ్రామాల రూపకల్పన లక్ష్యంగా టి ఎస్ ఎస్ కళాకారుల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్యచరణ సాగాలని అన్నారు. పొగాకు ఉత్పత్తుల చట్టం 2003 సెక్షన్ 4 ప్రకారం బహిరంగ ప్రదేశాలలో,కార్యాలయాలలో పొగాకు త్రాగడం నేరమని, సెక్షన్ 5 ప్రకారం పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు నిషేధించాలని, కిరాణా షాపుల వద్ద ఎక్కడా సిగరెట్ ప్యాకెట్ల ప్రచారం నిర్వహించడానికి వీల్లేదని, సెక్షన్ 6 ప్రకారం 18 సంవత్సరాల కంటే చిన్న పిల్లలకు అమ్మడం నేరమని, ఈ చట్టాలు పకడ్బందీగా అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వసంత్ రావు, డిపిఆర్ఓ వి.శ్రీధర్ , డి ఐఓ. మోహన్, లేబర్ ఆఫీసర్, నజీర్ అహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్.అనూష, డ్రగ్ ఇన్స్పెక్టర్ భవాని, సేల్స్ టాక్స్ అధికారి శైలజ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ రఘునందన్, మానేర్ ఎన్.జి.ఓ. మెంబర్ సి. హెచ్.భాస్కర్, కమర్షియల్ ట్యాక్స్, కార్మికశాఖ, విద్యాశాఖ,పోలీస్ శాఖ, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు




**బలగం టీవీ ,సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ఫలితాలలో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్లో నియామక పత్రాలు అందజేయనుండగా, జిల్లా నుంచి తరలివెళ్లారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంధాలయం వద్ద ఎంపికైన 130 మంది అభ్యర్థులు మూడు బస్సుల్లో హైదరాబాదుకు తరలి వెళ్లే వాహనాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్, ఎస్ జి టీ, భాషా పండితులు, పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు మొత్తం కలిసి దాదాపు 130 మంది అర్హత సాధించారని అన్నారు . వీరందరికి హైదరాబాద్లో ఎల్బీ స్టేడియంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నారని అన్నారు . మూడు వాహనాలకు ఆరోగ్య, పోలీస్ సిబ్బందిని కేటాయించారు. అలాగే ఒక్కో బస్సుకు ఎంఈఓలను లైజెన్ ఆఫీసర్ గా నియమించి, వారిని పంపించారు. వీరి వెంట జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగంలో

# సమూల మార్పులు తీసుకురానున్నాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పుకునేలా ప్రైవేటు సంస్థలతో పోటీ పడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. తొలిదశలో 5 వేల కోట్లు వెచ్చించి, 25 నియోజకవర్గాల్లో సకల వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌కు ఈనెల 11న శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని... మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి సారథ్యంలోని విద్యా కమిషన్ చేసే సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యం ప్రదర్శించిన బదిలీలు, ప్రమోషన్ల సమస్యను పరిష్కరించాం. ఎక్కడా చిన్న వివాదం లేకుండా 34 వేల మంది టీచర్లకు బదిలీలు చేయడంతో పాటు 21 వేల మందికి ప్రమోషన్లు కల్పించామన్నారు. తెలంగాణ భావితరాలను అద్భుతమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత యువతరం టీచర్లదే. ఆ టీచర్లకు కావాల్సినవన్నీ సమకూర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. యువత మాదకద్రవ్యాలకు, వ్యసనాలకు బానిసలు కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

మళ్లీ అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ నేతలు కలలుగంటున్నారని, అది కలే అని అన్నారు. మా ప్రభుత్వాన్ని నిర్ణీత కాలపరిమితికన్నా ముందే కూలగొడతామనుకుంటే ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం కోసం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తుంటే కాళ్లల్లో కట్టెలు



పెడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొడితేనే మీకు ఉద్యోగాలు వస్తాయని ఆనాడే మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారమే ఇవాళ ఉద్యోగ నియామకాలు చేపట్టామని కొత్త అధ్యాపకుల హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రి ప్రకటించారు.తెలంగాణ పిల్లలు, మన పిల్లలు.. మన తమ్ముళ్లు,. మన చెల్లెళ్లు కాదా? పేదోళ్ల ఇళ్లల్లో సంతోషం ఉండొద్దా? మీ కుటుంబం బాగుంటె అంతా బాగున్నట్లా? మీకు మీ స్వార్థం తప్ప పేదలు అవసరం లేదా ? అని కేసీఆర్‌పై మండిపడ్డారు. తాము మాత్రం కేసీఆర్ మాదిరి కాదని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచే తెలంగాణ బిడ్డల అభ్యున్నతి, రాష్ట్ర ప్రగతి కోసం పది నెలల్లో ఒక్క రోజు, ఒక్క గంట కూడా వృథా చేయకుండా పని చేస్తున్నామని చెప్పారు.

వచ్చే ఒలింపిక్స్‌లో తెలంగాణ బిడ్డలు బంగారు పతకాలను సాధించాలనేదది తన లక్ష్యమని అందుకే గచ్చిబౌలిలో 70 ఎకరాల్లో క్రీడా యూనివర్సిటీని ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేవలం 4 కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియా ఒలింపిక్స్‌లో పతకాల పంటను సాధించిందని, 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఎన్ని పథకాలు రావాలో ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలో ఏర్పాటుకానున్న క్రీడా యూనివర్సిటి దేశానికే తలమానికం కానుందని సీఎం చెప్పారు. భవిష్యత్తు నిర్మాతలు ఉపాధ్యాయులేనని, భావి నిర్మాతలను తీర్చిదిద్దాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో భయానక వాతావారణం సృష్టించారు



(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ జాబ్ పొగొట్టండి. మీకు ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఇది నా గ్యారంటీ అని హామీ ఇచ్చాడు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని కేటీఆర్ తెలిపారు. మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు. కోటి 60 లక్షల మంది మహిళలు రూ. 2500ల కోసం వేచి చూస్తున్నారు. వృద్ధులకు రూ. 4 వేలు అన్నాడు. ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అన్నాడు. ఒక్కరికన్నా వచ్చిందా? అంటే లేనే లేదు. ఉన్న రైతు బంధు, ఉన్న పింఛన్ కూడా వస్తలేదు. వాళ్లు 420 హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఏమైనయ్ అంటే సమాధానం చెబుతలేడు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తా అన్నాడు. తులం ఇనుము కూడా ఇవ్వడని కేటీఆర్ విమర్శించారు.

సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమీషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు... రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు... మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటదని కేటీఆర్ అన్నారు. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట. ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు.

# భారత్‌దే టీ20 కప్


**బలగం టీవి, హైదరాబాద్**

టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను వైట్ వాష్ చేసిన భారత జట్టు టీ20 సిరీస్ కూడా కైవసం చేసుకుంది. ఢిల్లీ మైదానంలో బంగ్లాతో జరిగిన రెండో టీ20లో నితీశ్ కుమార్ రెడ్డి(74), రింకూ సింగ్(53)లు దంచి కొట్టగా హార్దిక్ పాండ్యా(32) మరోసారి సూపర్ బ్యాటింగ్‌తో అలరించాడు. టీమ్ ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసింది.

అనంతరం నితీశ్(2/23)తో పాటు వరుణ్ చక్రవర్తి(2/19) చెలరేగగా బంగ్లా 135 పరుగులకే పరిమితమైంది. దాంతో, టీమిండియా 86 పరుగుల తేడాతో జయభేరి మోగించి మరో మ్యాచ్ ఉండగానే 2–0తో పొట్టి సిరీస్ గెలుచుకుంది. నామమాత్రమైన మూడో టీ20 ఉప్పల్ స్టేడయంలో జరుగనుంది.

222 పరుగులు లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 135 పరుగులు మాత్రమే చేసింది. భారీ ఛేదనలో బంగ్లాదేశ్ తడబడింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్.. ఓపెనర్ పర్వేజ్ హెుసేన్ ఎమొన్(16)ను బౌల్డ్ చేసి వికెట్ల వేట మొదలెట్టాడు.ఆ తర్వాత వరుణ్ బౌలింగ్‌లో హార్దిక్ పాండ్యా స్టన్నింగ్ క్యాచ్ పట్టగా డేంజరస్ లిట్టన్ దాస్(14) వెనుదిరిగాడు. ఇక ఆదుకుంటాడనుకున్న కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(11) సైతం విఫలమయ్యాడు. బ్యాటుతో ఇరగదీసిన నితీశ్ బంతితోనూ చెలరేగగా బంగ్లా ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్ అయిన మహ్మదుల్లా(41) డగౌట్ చేరాడు. అంతే బంగ్లా ఓటమి ఖాయమైంది.




# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది నోబెల్ బహుమతి వరించింది. ప్రొటీన్ల డిజైన్లకు సంబంధించిన పరిశోధనలకు గానూ శాస్త్రవేత్తలు డేవిడ్ బెకర్ , డెమిస్ హసబిస్ , జాన్ ఎం. జంపర్ ను నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తాజాగా వెల్లడించింది. కంప్యూటేషనల్ ప్రొటీన్ డిజైన్‌కు గానూ బెకర్, ప్రొటీన్ స్ట్రక్చర్ ప్రిడికన్ కు గానూ డెమిస్, బంపర్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

# శ్రీలంకపై భారత్ విజయం

## మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇండియా సెమీస్ ఆశలు సజీవం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహిళల టీ20 ప్రపంచకప్ లో సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన కీలక మ్యాచ్‌లో శ్రీలంకను భారత్ చిత్తుగా ఓడించింది. శ్రీలంక ముందు 173 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించని భారత్.. శ్రీలంకను 90 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో 82 పరుగుల తేడాతో విజయం సాధించింది. అలాగే, మహిళల టీ20 ప్రపంచకప్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం.

శ్రీలంక బ్యాటర్లలో కవిషా దిల్హారి (21), అనుష్క సంజీవని (20), అమ కాంచన (19) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. భారత బౌలర్ల ధాటికి మిగిలిన వారు పెవిలియన్‌కు వరుసగా క్యూ కట్టారు. దీంతో శ్రీలంక జట్టు 19.5 ఓవర్లలో 90 పరుగులకే ఆలౌటైంది.భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి, ఆశా శోభన మూడు వికెట్లు దక్కించుకున్నారు. రేణుకా సింగ్ రెండు వికెట్లు తీయగా శేయాంక పాటిల్, దీప్తి శర్మ తలో వికెట్ పడగొట్టారు. కాగా, ఈ ఓటమితో శ్రీలంక జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అంతకముందు బ్యాటింగ్ చేసిన దాంతో భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 172/3 పరుగులు సాధించింది. కెప్టెన్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 8ఫోర్లు, 1సిక్స్ లి52 నాటౌట్), వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (38 బంతుల్లో 4ఫోర్లు, 1సిక్స్ లి50) అర్థ శతకాలతో విజృంభించారు. ఇక ఓపెనర్ షఫాలీ వర్మ (43) పరుగులతో రాణించింది. దాంతో భారత స్కోర్ భారీగా వెల్లింది.


# స్కాట్లాండ్‌పై దక్షిణాఫ్రికా విజయం

**బలగం టీవి, హైదరాబాద్**

మహిళల టీ20 వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా జట్టు బుధవారం స్కాట్లాండ్ ను చిత్తుగా ఓడించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి ఏకంగా 80 పరుగుల తేడాతో గెలుపొందింది. నొన్‌కులులెకొ లబా(3//12), క్లోయె ట్రయాన్(2/22)ల విజృంభనతో స్కాట్లాండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. దాంతో, మెరుగైన రన్‌రేటు సాధించిన లారా వొల్వార్ట్ సేన గ్రూప్ బీలో అగ్రస్థానానికి ఎగబాకి సెమీస్ రేసులో నిలిచింది.

దక్షిణాఫ్రికా స్కాట్లాండ్‌కు 165 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. నొన్‌కులులెకొ లబా(3/12), క్లోయె ట్రయాన్(2/22)లు స్కాట్లాండ్ బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టారు. దాంతో.. స్కాట్లాండ్ 86 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా మొదట కొండంత స్కోర్ చేసింది. ఓపెనర్లు తంజిమ్ బ్రిట్స్(43), లారా వొల్వార్ట్(40), ఆల్‌రౌండర్ మరినే కాప్(43) అద్భుతంగా ఆడారు. దాంతో, దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది.

# లేడీ ఓరియెంటెడ్ సినిమాలో సంయుక్త



బలగం టీవీ, హైదరాబాద్

మలయాళీ బ్యూటి సంయుక్త లేడీ ఓరియెంటెడ్ సినిమాలో నటించబోతుంది. ఈ మేరకు ఆ కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టింది. ఈ భామ ఇప్పటికే వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇక సంయుక్త లీడ్ రోల్‌లో ఒక న్యూ ఏజ్ యాక్షన్ డ్రామా రాబోతుంది. హాస్య మూవీస్ బ్యానర్‌లో రానున్న ఈ చిత్రం నేడు పూజ కార్యక్రమాలు జరుపుకుంది. ఈ వేడుకు ముఖ్య అతిథిగా వచ్చిన రానా దగ్గుబాటి క్లాప్ నివ్వగా.. నిర్మాతలు దిల్ రాజు, కోనా వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఇక ఈ సినిమాకు యోగేశ్ దర్శకత్వం వహించబోతున్నాడు.కాగా ఈ సినిమాపై సంయుక్త మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. తెలుగులో నేను ఇంతకుముందు చేసిన అన్ని సినిమాలు మంచి హిట్ అందుకున్నాయి. ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో మీ ముందుకు రాబోతున్నాను. ఈ క్రెడిట్ అంతా మా మేనేజర్‌దే. నా స్టోరీలు మొదట ఆయనే ఎంపిక చేస్తారు. ఈ మూవీ షుఉటింగ్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందా అని వెయిట్ చేస్తున్నా అంటూ సంయుక్త చెప్పుకోచ్చింది.

# త్వరలో పెండ్లి పీటలెక్కనున్న ప్రభాస్..!



బలగం టీవీ, హైదరాబాద్

వరుస సినిమాలతో దూసుకుపోతున్న ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ త్వరలో పెండ్లి పీటలెక్కనున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి ప్రభాస్ పెద్దమ్మ, లెజండరీ యాక్టర్ కృష్ణం రాజు భార్య శ్యామలాదేవిని మీడియా ప్రశ్నించగా. ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

నవరాత్రి ఉత్సాహాల్లో భాగంగా ప్రభాస్ పెద్దమ్మ, కృష్ణం రాజు భార్య శ్యామల దేవి విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో ఓ మీడియా ఛానెల్ ప్రభాస్ పెళ్ళికి సంబంధించి ప్రశ్న అడగగా ఆమె సమాధానమిస్తూ.. "దీర్ఘ కాలం నుండి వేచి చూస్తున్న పెళ్ళికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ త్వరలోనే ఉండబోతుంది. పైనున్న కృష్ణం రాజు గారు అన్ని సవ్యంగా చూసుకుంటారు. ఇప్పటి వరకు అనుకున్నవని అనుకున్నట్లే అయ్యాయి. మా కుటుంబం మొత్తం ప్రభాస్ ఎప్పుడెప్పుడు ఒకింటి వాడవుతాడా అంటూ వెయిట్ చేస్తున్నాము" అన్నారు. అలాగే పెళ్లి కూతురేవారు అని ప్రశ్నడగగా ఆమె సమాధానం దాటవేశారు. మరోవైపు ప్రభాస్‌మెరుపు వేగంతో దూసుకెళ్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో సలార్ 2, రాజాసాబ్, కన్నప్ప కల్కి 2 , స్పిరిట్, హను రాఘవపూడితో ఓ చిత్రం ఉన్నాయి.ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాజాసాబ్'తో చిత్రీకరణ పరుగులు పెట్టిస్తున్నారు.వచ్చే ఏడాది వేసవి కానుకగా ఏప్రిల్ 10న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

# రాజేంద్రప్రసాద్‌కు ప్రభాస్ పరామర్శ



బలగం టీవీ, హైదరాబాద్

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్‌ను రాజేంద్రప్రసాద్ కూతురు గాయత్రి ఇటీవలె గుండెపోటులో మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజేంద్రప్రసాద్‌ను నటుడు ప్రభాస్ పరామర్శించారు. కూకట్‌పల్లిలోని హిందూ విల్లాస్‌లో రాజేంద్ర ప్రసాద్ నివాసానికి వెళ్లి గాయత్రి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌తో పాటు కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కాగా..రాజేంద్ర ప్రసాద్‌ను పలువురు సినీ ప్రముఖులతో పాటు వివిధ రంగాల వారు పరామర్శిస్తున్నారు.



# ఓటీటీలోకి 'మత్తు వదలరా 2'

బలగం టీవీ, హైదరాబాద్

ఇటీవల వచ్చి హిట్ కొట్టిన "మత్తు వదలరా 2" చిత్రం ఇప్పుడు ఓటిటి రిలీజ్ కి సిద్ధం అయ్యింది. శ్రీసింహా హీరోగా ఫరియా అబ్దుల్లా ఫీమేల్ లీడ్ లో కమెడియన్ సత్య సాలిడ్ రోల్ లో దర్శకుడు రితేష్ రానా తెరకెక్కించిన చిత్రం మంచి వసూళ్లు అందుకుంది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ వారు సొంతం చేసుకున్నారు. ఈ మేరకు ఈ అక్టోబర్ 11 నుంచి స్ట్రీమింగ్ కి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టుగా నెట్ ఫ్లిక్స్ లో పొందుపరిచారు. ఇక ఈ చిత్రానికి కాల భైరవ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

# ప్రశాంత్‌నీల్-రామ్‌చరణ్ కాంబోలో మూవీ..!



బలగం టీవీ, హైదరాబాద్

రామ్‌చరణ్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో సినిమా దాదాపు ఖరారైనట్టు సమాచారం. డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు తెలిసింది. ప్రశాంత్‌నీల్ ఇప్పటికే ప్రభాస్, ఎన్టీఆర్ సినిమాలకు కమిటై ఉన్నారు. అవి పూర్తయిన తర్వాత ఈ సినిమా పట్టాలెక్కనుంది. దాంతో 2029లో ఈ సినిమా ఉంటుందని సమాచారం.

# జనక అయితే గనక రిలీజ్ ట్రైలర్..




బలగం టీవీ, హైదరాబాద్

ఈ ఏడాది ఇప్పటికే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్న వదనం, శ్రీరంగ నీతులు, గొర్రె పురాణం అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాలను అందుకున్న సుహాస్ ఇప్పుడు మళ్లీ ఒక కొత్త స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. సుహాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. ఈ సినిమాకు సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తుండగా.. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

ఈ ట్రైలర్ చూస్తే.. ఎల్‌కేజీ, యూకేజీలకే లక్షలు వసూలు చేస్తున్న ఈ కాలంలో ఒక మిడిల్ క్లాస్ యువకుడు(సుహాస్) తనకు పిల్లలు పుడితే వారిని ఎలా పెంచాలి, ఎలా చదివించాలి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఈ కాలంలో పిల్లలను పెంచడం కష్టమని పిల్లలు వద్దనుకుంటున్నా సుహాస్‌కు సడన్‌గా తన భర్య గర్భవతి అంటూ షాక్ ఇస్తుంది. అయితే తాను వాడిన కండోమ్ వలనే ఇలా అయ్యిందంటూ నాసిరకం కండోమ్‌లను సప్లయ్ చేస్తున్న కంపెనీపై కేసు పెడతాడు. అయితే ఈ కేసు సుహాస్ జీవితంలో ఎలాంటి మలుపు తీసుకుంది. చివరకు తాను కండోమ్ కంపెనీపై పెట్టిన కేసు గెలిచాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఈ సినిమాలో సుహాస్‌తో పాటు, సంగీత్, వేన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'జనక అయితే గనక'కు నాగచైతన్యను అనుకున్నాను కానీ..

- దర్శకుడు సందీప్



బలగం టీవీ, హైదరాబాద్

'జనక అయితే గనక' సినిమా గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు సందీప్ బండ్ల పలు ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నారు. మొదట ఈ సినిమాకు అక్కినేని నాగ చైతన్యను హీరోగా అనుకున్నట్లు ఆయన చెప్పారు. 'నాగ చైతన్యతో కలిసి కొన్ని నెలలు ట్రావెల్ చేశాను. నా తొలి సినిమాలో ఆయననే హీరోగా అనుకున్నాను. కానీ, ఆ సమయంలో శేఖర్ కమ్ములతో చైతన్య 'లవ్‌స్టోరీ' సినిమాతో బిజీగా ఉన్నారు. అందుకే నాతో సినిమా చేయలేకపోయారు. అప్పుడే నిర్మాత దిల్‌రాజు, లీడ్ రోల్ కోసం సుహాస్? పేరును చెప్పారు' అని దర్శకుడు సందీప్ తెలిపారు. అయితే మిడిల్ క్లాస్ వ్యక్తి తండ్రి అవ్వడానికి ఎలా ఆలోచిస్తాడు? ఖర్చులకు విపరీతంగా ఆలోచించే అలాంటి వ్యక్తి తండ్రి అయితే పరిస్థితి ఎలా ఉంటుంది? అచ్చం అలాగే తాను అనుకున్న విధంగా బెస్ట్ ఇవ్వలేనేమోననే భయంతో పిల్లలు వద్దనుకునే మిడిల్ క్లాస్ వ్యక్తి పాత్ర పోషించారు సుహాస్. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ అన్ని రకాల ఎలిమెంట్స్' ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.